మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్‌ను మళ్లీ గెలిపించాలి



సూరారం డివిజన్ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభలో 2019లో మాదిరిగా తిరిగి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి తనయుడు పట్నం రినీష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ఓటు వేయాలని అభ్యర్థించాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న విష ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, బండి శ్రీనివాస్‌గౌడ్, లాయక్, శ్రీనివాస్, జహంగీర్, చాంద్ పాషా, రషీద్, బలరాం, మధు, పద్మ, పూలమ్మ, నర్సింగరావు, రాజిరెడ్డి, లక్ష్మి నారాయణరెడ్డి, కల్పనారెడ్డి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్‌కు అడ్డా

మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అడ్డా అని.. మరోమారు కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సూరారం డివిజన్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. డివిజన్ అధ్యక్షుడు రహ్మతుల్లా ఆధ్వర్యంలో గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి శ్రీశైలంగౌడ్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు, నాయకులు అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారం తదితర అంశాలపై ఆయన సూచనలు చేశారు. సునీతామహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు. మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, నాయకులు కూన రఘుగౌడ్, సుశాంత్‌గౌడ్, వేణు గోపాల్‌రాజు, సుజాత, గొల్ల జాన్, కిశోర్‌రెడ్డి, విజయలక్ష్మి, అన్నపూర్ణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీడీ కిలి బిగిస్తారా.?

- ఎట్టకేలకు చిక్కిన రౌడీషీటర్, భూకబ్జాదారుడు షేక్ అబిద్
- ఠాణాలో సంతకం చేయకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడు
- ఎస్ఓటీ, ఇంటెలిజెన్స్ పోలీసులకు చుక్కలు చూపించిన వైనం

ఓ వైపు పోలీసులు వెంటబడ్డారు... మరోవైపు కాంగ్రెస్‌లో చేర్చుకోండంటూ పరుగులు పెట్టాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. ఇది కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భూకబ్జాదారుడిగా ముద్రపడ్డ షేక్ అబిద్ కథ. అటు రెవెన్యూ.. ఇటు పోలీసులకు ఇబ్బందిగా మారిన షేక్ అబిద్‌పై పిడికిలి బిగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.



షేక్ అబిద్‌ను సంగారెడ్డి జైలుకు తరలిస్తున్న జగద్గిరిగుట్ట పోలీసులు

కుత్బుల్లాపూర్: ఎట్టకేలకు షేక్ అబిద్ పోలీసులకు చిక్కడంతో అతడిని జైలుకు పంపారు. రౌడీషీటర్, భూకబ్జాదారుడైన చేసిన అక్రమ నిర్మాణాలు, అధికారులపై దాడుల గురించి తెలుసుకుందాం. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే గాజులరామారం సర్వే నం.329/1, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సర్వే నం.307లతో పాటు ప్రభుత్వ స్థలాల్లో గదులు నిర్మించి లక్షలాది రూపాయలకు వాటిని అమ్మి సొమ్ము చేసుకుని కోట్లు సంపాదించాడనే ఆరోపణ ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు అప్పట్లో కూల్చివేతలకు వెళ్లగా వారిపైనే దాడికి దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంతటితో ఆగకుండా పోలీస్ కేసు నమోదు కాగానే కోర్టు ద్వారా బెయిల్ తీసుకొని తిరిగి కబ్జాలు చేస్తూ వచ్చాడు. షేక్ అబిద్ బుధవారం పోలీసులకు చిక్కి సంగారెడ్డి జైలుకు వెళ్లడం చర్చగా మారింది.

ఒకరు ఫిర్యాదు.. నలుగురు బాధితులు..

గాజులరామారం సర్వే నంబర్ 329/1లో ప్రభుత్వ స్థలంలో పలు గదులను నిర్మించగా రెవెన్యూ అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కూల్చివేతల ప్రక్రియ చేపట్టారు. షేక్ అబిద్ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన ఓ వ్యక్తి ఏకంగా రూ.11.50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టగా మరో నలుగురు రూ.6.50 లక్షలతో పాటు రూ.లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదు చేశారు. ఇలా మొత్తం నాలుగు కేసులను నమోదు చేసిన జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ అతడిని అరెస్టు చేసేందుకు వెళ్లగా పారిపోయాడు.

గతంలో అతడిపై 16 కేసులు నమోదు

గతంలో ఉన్న కేసులతో పాటు మొత్తం 16 కేసులు అతడిపై నమోదైనట్లు తెలిపారు. ఇదే క్రమంలో సైబరాబాద్ కమిషనర్ ఆదేశాలతో షేక్ అబిద్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారు. నాటి నుంచి నేటి వరకు పోలీస్‌స్టేషన్‌లో సంతకం కూడా చేయకుండా తప్పించుకొని తిరుగుతూ ఎస్ఓటీ, ఇంటెలిజెన్స్ పోలీసులకు చుక్కలు చూపిస్తూ వచ్చాడు. దేవేందర్‌నగర్‌లో ఓ రహస్య ప్రదేశంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు చాకచక్యంగా పట్టుకొని బుధవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.

కాంగ్రెస్‌లో చేరేందుకు విశ్వప్రయత్నాలు..

గాజులరామారంలో భూకబ్జాదారుడిగా పేరు పొందిన షేక్ అబిద్ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గడిచిన మూడు నెలలుగా ఆ పార్టీలో చేరేందుకు విశ్వ ప్రయత్నాలు చేశాడు. కానీ స్థానిక నాయకత్వం అతని చేరికను అడ్డుకోవడంతో విఫలమయ్యాడు. పోలీసులు తనను అరెస్టు చేస్తారని భావించి పలువురి వద్ద తనను అరెస్టు చేస్తే కాంగ్రెస్ ఢిల్లీ పెద్దల నుంచి ఫోన్లు చేసి బయటకు వస్తానని చెప్పినట్లు తెలిసింది. గత నెల రోజులుగా జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ అతడి కదలికలపై నిఘా పెట్టి ఎట్టకేలకు అరెస్టు చేశారు.



నిందితుడు షేక్ అబిద్

రౌడీ షీటర్లలో గుబులు...

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌తో పాటు దుండిగల్, సూరారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూకబ్జాదారులను గుర్తించి రౌడీషీట్ ఓపెన్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో విచ్చలవిడిగా భూకబ్జాలు చేసి అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలతో రావి నారాయణరెడ్డినగర్‌కు చెందిన నరసింహతో పాటు బాలయ్యనగర్‌కు చెందిన నగేష్, దేవేందర్‌నగర్‌కు చెందిన రమేష్ నాయక్, వడ్డే మురళి, గాలి పోచమ్మ బస్తీకి చెందిన శ్రీనివాస్ అలియాస్ డాన్ శ్రీనులతో పాటు షేక్ అబిద్‌లపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఇటీవల ఎన్నికల సమయాన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్లలో బైండోవర్ చేశారు. అయితే కొంతమంది రౌడీషీటర్లు తప్పించుకుంటూ పోలీస్‌స్టేషన్‌కు రాకుండా పరారీలో ఉన్నారు. ప్రస్తుతం వీరిపై జగద్గిరిగుట్ట పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు.

ఇది ఎన్నికల ప్రచారం కాదు



పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ కరపత్రాలు పంచుతున్న ఉపాధ్యాయులు

సుభాష్‌నగర్: ఈ చిత్రాన్ని చూస్తుంటే ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నట్టు అనిపిస్తుంది కదా. అయితే మీరు పప్పులో కాలేసినట్టే. ఈ నెల 23 వరకు స్కూల్ అయిపోగా, కొత్త అకాడమీ కోసం మీ పిల్లలను మా పాఠశాలలోనే చేర్పించండంటూ పలు పాఠశాలల సిబ్బంది కాలనీలు, బస్తీల్లో తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఓవైపు పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికంగా రాజకీయ నాయకులు మీ ఓటు తమ పార్టీ అభ్యర్థికే వేయాలని కోరుతుండగా... మరోవైపు మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఇలా ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు.

నీటి ఎద్దడి.. జనం పరేషానీ!



రోజువారీ అవసరాలకు ట్యాంకర్లలో నీటిని తెచ్చుకుంటున్న రంగారెడ్డిబండ వాసులు

సుభాష్‌నగర్: వేసవికాలంలో కొన్ని బస్తీలలో నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా నీరు రాకపోవడంతో అవి ఏమాత్రం సరిపోవటం లేదని, దీని తోడుగా బోర్ లేకపోవడంతో సమస్య మరింత జఠిలంగ మారిందని రంగారెడ్డిబండ వాసులు పేర్కొటున్నారు. పక్కనే ఉన్న వైష్ణవి కాలనీలోని తాము పనిచేస్తున్న ఇళ్ల నుండి ప్రతిరోజు ట్యాంకర్లలో నీటిని తెచ్చుకుంటున్నామని స్థానిక మహిళలు పేర్కొంటున్నారు.

మహిళా భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడు?



బేస్‌మెంట్ వరకే పనులు పూర్తి. చెత్త డబ్బా, చెత్త సేకరణ రిక్షా

రంగారెడ్డినగర్: మహిళా భవన నిర్మాణం ఒక అడుగు ముందుకు.. రెండగుల వెనక్కి అన్న చందంగా తయారైంది. భవనానికి శంకుస్థాపన చేసి 8 నెలలు గడుస్తున్నా కేవలం బేస్‌మెంట్‌కే పరిమితమైంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ వార్డు కార్యాలయం ఎదురుగా ఉన్న పాత కమిటీ హాలులో గతంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగేది. కాగా భవనం శిథిలావస్థకు చేరి భూమిలోకి దిగబడటంతో చాలా రోజులుగా ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో 2023 ఆగస్టు 16న సదరు భవనాన్ని కూల్చివేసి మహిళా భవన నిర్మాణానికి రూ.25 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు.

◆ అయితే సదరు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణం విషయంలో తాత్సర్యం చేస్తున్నాడు. ఇప్పటికే ఒకసారి అసెంబ్లీ ఎన్నికలు, తాజాగా లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఎన్నికల కోడ్ నెపంతో పనులను నిలిపివేశారు. దీంతో ఎనిమిది నెలలుగా కేవలం బేస్‌మెంట్, పిల్లర్లు నిర్మాణానికి ఇనుప చువ్వలను వేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. ప్రస్తుతం సదరు భవన స్థలంలో స్థానికంగా చెత్తను సేకరించే డబ్బాలు, చెత్త రిక్షాలను ఉంచుతున్నారని, ఇంకెన్నాళ్లు భవన నిర్మాణాన్ని కొనసాగిస్తారని స్థానిక మహిళా సంఘం సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మహిళా భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

టెక్నాలజీల అభివృద్ధిలో గణితం, డేటాసైన్స్ పాత్ర కీలకం



అంతర్జాతీయ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల యాజమాన్యం

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాలలో గురువారం 'అప్లైడ్ మేథమెటిక్స్ అండ్ అడ్వాన్స్‌డ్ డేటా ఎనలిటిక్స్ ఫర్ ఇండస్ట్రీ 5.0'పేరిట అంతర్జాతీయ సదస్సును ప్రారంభమైంది. ఈ ప్రారంభ కార్యక్రమానికి అతిథులుగా విదేశాంగశాఖ సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ గిరీశ్‌కుమార్, ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రీతు కరిధల్, మహీంద్ర విశ్వవిద్యాలయ సలహాదారు డాక్టర్ అరుణ్‌కుమార్ పూజారి, ఎన్ఆర్ఎస్‌సీ ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరీశ్ కుమార్ మాట్లాడుతూ... గతంలో ప్రాదేశిక మ్యాప్ రూపొందించాలంటే చాలా కష్టతరంగా ఉండేదన్నారు. జియోస్పేషియల్ టెక్నాలజీతో ఇప్పుడు చాలా సులువైందన్నారు. ఈ టెక్నాలజీ అభివృద్ధిలో గణితశాస్త్రం, డేటాసైన్స్ పాత్ర అత్యంత ప్రముఖమని పేర్కొన్నారు. డ్రోన్లను వాడి నేటి కాలానికి అనుగుణంగా కంప్యూటింగ్‌ను మరితం వేగవంతం చేయాలన్నారు.

◆ డాక్టర్ రీతు మాట్లాడుతూ... చంద్రయాన్, గగన్‌యాన్‌ల విజయం వెనుక ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందన్నారు. అనువర్తిత గణితశాస్త్రం సాయపడిన తీరును వివరించారు. వీజేఐఈటీ ప్రధాన కార్యదర్శి జేఎస్ రావు మాట్లాడుతూ.. డేటా సైన్స్ రంగంలో రావాల్సిన మార్పుల గురించి ఈ సదస్సులు చర్చించాలన్నారు. గణితశాస్త్ర సూత్రాలను విద్యార్థులు క్షుణ్ణంగా నేర్చుకుని డేటా సైన్స్ రంగంలో కలిగే సమస్యలకు తగు పరిష్కార మార్గాలను కనుగొనాలన్నారు. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన నిపుణులు, 270 మంది పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనను న్నారని కళాశాలకు చెందిన హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగం ఆచార్య డాక్టర్ జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన సావనీర్ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు ఆచార్య డాక్టర్ బి.చెన్నకేశవరావు, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత వేసవి సైన్స్ శిబిరం

నిజాంపేట్: జనవిజ్ఞాన వేదిక బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వేసవి సైన్స్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఏప్రిల్ 26 నుంచి మే 2వ తేదీ వరకు ప్రగతినగర్‌లోని సుందరయ్యభవన్‌లో శిబిరం కొనసాగుతుంది. ఈ సైన్స్ శిబిరంలో పాల్గొనాలనుకునే వారు ఫోన్ నం. 93485 81007, 99590 63742లో సంప్రదించాలి.

ప్రగతి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

నిజాంపేట్: ప్రగతి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుండి మే 9వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్ వేదిక ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు జరిగే సమ్మర్ క్యాంప్‌లో కథలు విందాం.. చెబుతాం, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, టీమ్ యాక్టివిటీస్, ఫన్ మ్యాథ్స్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, సీపీఆర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, మీట్ ది సైంటిస్ట్, ఫీల్డ్ ట్రిప్, పాత, కొత్త ఆటలు వంటివి నిర్వహించనున్నారు. 5వ తరగతి నుంచి 9 వరకు చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రూ.150 నామమాత్రపు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు ఫోన్ నం .74165 00946 / 74165 00947.

కారు గుర్తుకే ఓటు వేయాలి

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా గురువారం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వివేకానంద్ ఆదేశానుసారం ప్రచారం నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, దుండిగల్ మున్సిపల్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నిజాంపేట్ కార్పొరేషన్,గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో కార్పొరేటర్లు ఇంటింటి ప్రచారం చేపట్టి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన సాయికిరణ్



కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట్‌లో చేపట్టిన బస్సు యాత్రలో గురువారం కొంపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రావల్‌కోల్ సాయికిరణ్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను కలిసి అభినందించిన ఆయన వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని జోష్యం చెప్పారు.

జేపీ నడ్డా రోడ్ షో ఏర్పాట్లపై సమీక్ష

- ఈనెల 29న నిజాంపేట్ కార్పొరేషన్‌లో ప్రచారం
- స్థానిక నాయకులతో రామచందర్‌రావు సమావేశం



నిజాంపేట్‌లో జరిగే రోడ్‌షో ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: దేశ ప్రజలు మరోమారు ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కోరకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు అన్నారు. ఈనెల 29న నిజాంపేట్ కార్పొరేషన్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎన్నికల ప్రచారం నేపథ్యంలో జరిగే రోడ్‌షోను విజయవంతం చేసేందుకు కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు నిజాంపేట్ కార్పొరేషన్ ప్రజలు సంసిద్ధులుగా ఉన్నారని అన్నారు.

◆ నిజాంపేట్ భవ్యాస్ ఆనంద్ నుంచి అభయాంజనేయస్వామి ఆలయం వరకు సాయంత్రం 6 గంటలకు జరిగే జేపీ నడ్డా రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు. సమావేశం అనంతరం రోడ్‌షో జరిగే ప్రాంతాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, మాజీ ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ప్రబారి గోలి మధుసూదన్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ఆర్.కె. శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఈటల భద్రయ్య, గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, విగ్నేష్, శంకర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, దుర్యోధనరావు, పత్తి సతీష్, సాయినాథ్‌రెడ్డి, అడ్వకేట్ కేశవ్‌యాదవ్, సుమన్‌రావు, భిక్షపతియాదవ్, అరుణ్‌రావు, సుబ్బారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించాం

భాగ్యరథి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల వెంకట్‌రెడ్డి



రాష్ట్ర ర్యాంక్ సాధించిన అఫ్షాన్ జబీన్, ఆమె తండ్రిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి

రంగారెడ్డినగర్: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తమ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారని చింతల్ భాగ్యరథి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల వెంకట్‌రెడ్డి అన్నారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు గురువారం కళాశాల యాజమాన్యం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించించామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ర్యాంకులు సాధించిన జూనియర్ ఇంటర్ విద్యార్థులు అఫ్షాన్ జబీన్ (బైపీసీ), రవీనా (ఎంపీసీ), షాహిమా(సీఈసీ), నందిని (ఎంఈసీ)లతో పాటు సీనియర్ ఇంటర్ విద్యార్థులు షబ్నం (ఎంపీసీ), రషీద్ (బైపీసీ), సౌమ్య(ఎంఈసీ), సాయిచందన(సీఈసీ)లతో పాటు వారి తల్లిదండ్రులను శాలువలతో సత్కరించారు.

◆ ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన విద్యార్థులకు తదుపరి విద్యా సంవత్సరంలో ఎటువంటి ట్యూషన్ ఫీజు లేకుండా ఉచిత విద్యను అందిస్తామన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతోనే ఉత్తమ ర్యాంకులు సాధ్యపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రామకృష్ణ, రమేష్ బాబు, నల్ల జైశంకర్‌గౌడ్, చల్లా గోవిందరెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



షాపూర్ నగర్‌లో..

జగద్గిరిగుట్ట: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జంట సర్కిళ్లలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిల్ డీసీలు మల్లారెడ్డి, నర్సింహులు ముఖ్యఅతిథిగా హాజరై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి సబ్‌స్టేషన్ వరకు, కుత్బుల్లాపూర్ మున్సిపల్ ఆఫీసు నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. దోమల వ్యాప్తిని అరికట్టాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీలతో పాటు ఏఎంసీ ఉదయ్‌కుమార్, ఏఎంఒహెచ్ భార్గవ్ నారాయణ, ఎంటమాలజీ సర్కిల్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ సర్కిల్ ఆఫీస్‌లో...

తాటి ముంజలు.. కడుపు సల్లగుండును!





సుభాష్‌నగర్: వేసవికాలంలో తాటి ముంజలను తింటే ఆ మజానే వేరు. వీటిని తీసుకోవడం వలన వేసవికాలంలో ఆరోగ్యంతో పాటు చల్లదనాన్ని అందించే ఫలాల్లో తాటి ముంజలు ముందువరుసలో ఉంటాయని చెప్పుకోవచ్చు.

భలే గిరాకీ...

ప్రస్తుతం ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ చూసినా తాటి ముంజలు విక్రయిస్తున్నారు. ప్రతిరోజు మచిలీపట్నం, ఆంధ్ర, రామోజీ ఫిలిం సిటీ ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ముంజలను కొనుక్కోడానికి చాలా మంది మక్కువ చూపుతున్నారు. మార్కెట్‌లో డజన్ తాటి ముంజల ధర రూ.120 పలుకుతోంది.

తాటి ముంజలతో ఉపయోగాలు....

తాటి ముంజలు ప్రకృతి వరప్రసాదం. వేసవిలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ముంజలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా దాహార్తిని తీరుస్తాయి. వీటిలో ఉండే అధిక శాతం నీరు శరీరాని డీహైడ్రేషన్ బారిన పడకుండా చేసి చలవ చేస్తుంది. వీటిని తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గి దాని స్థానంలో మంచి కొలెస్ట్రాలు వృద్ధి చెందుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వేసవిలో ఎండా కారణంగా వచ్చే వికారం వాంతులకు చెక్ పెడుతుంది. సీజన్‌లో వీటిని ప్రతి రోజు క్రమం తప్పకుండా తీసుకోవడం వలన లివర్ సంబంధిత వ్యాధులను తగ్గిస్తుంది.







'మనూ'లో అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులకు అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. యూనివర్సిటీలోని బీఏ, బీఈడీ, బీఎస్సీ, బీకామ్ నాలుగు ఏళ్ళ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు (ఐటీఈపీ) అభ్యర్థుల కోసం జాతీయ సాధారణ ప్రవేశ పరీక్ష (ఎన్‌సీఈటీ) ద్వారా కొత్త విద్యావిధానం -2020కి అనుగుణంగా అడ్మిషన్లకు ఏర్పాట్లు చేశామన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏలో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఈడీ, బీఎస్సీ, బీకామ్ ఇంటిగ్రేటెడ్ కోర్సులలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే ఎన్‌సీఈటీలో సాధించిన స్కోర్‌ల ఆధారంగా అడ్మిషన్లు కల్పించడం జరుగుతుందని వివరించారు. వివరాలకు ఫోన్ నంబర్లు 6207728673, 63027 38370లలో సంప్రదించాలని కోరారు.

29న నిధి ఆప్‌కే నిఖత్

మూసాపేట: కూకట్‌పల్లిలో ప్రావిడెంట్ ఫండ్ (పియఫ్) కార్యాలయంలో నిధి ఆప్‌కే నిఖత్ నిర్వహించనున్నట్లు పియఫ్ కమిషనర్ డా. హేమంత్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లిలో ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లో గల రెండవ అంతస్తులోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో, నాసెన్స్ లాబ్ ప్రైవేట్ కంపెనీ, జీడిమెట్లలో ఉంటుందని, ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవటమే కాక, సలహాలు, సూచనలు తీసుకుంటామని అన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్ లింగంపల్లి, బీహెచ్ఇఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్‌ల ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

తప్పనిసరిగా ఓటు వేయాలి

గచ్చిబౌలి: పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి ఒక్కరు విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. గురువారం టింబర్ లేక్ కాలనీ, నోవాటెల్, సుదర్శన్‌నగర్‌లో లైసెన్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, పీఓ ఉమారాణి ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటింగ్‌కు దూరంగా ఉండటం తగదని అధికారులు సూచించారు. ఓటింగ్ శాతం పెంచుతామని ప్రతిజ్ఞ చేయించారు.